## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది( న్యస్తాక్షరి)

మంచి (మ)నసునున్న మహిలోన మనుజులు
మ(ధు)ర భాషణమున మసలుచుండు
మంచితనము (మ)రచి మర్యాద విడనాడ
(ధు)ష్కరణము జేసి దుష్టుడగును

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 36 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 13-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00





## పెట్రోల్ బంకుల వద్ద
# భారీ డీజిల్ కొనుగోళ్లకు బ్రేక్

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకే పరిమితి
- పరిశ్రమలు ప్రత్యేక సరఫరా వ్యవస్థల నుంచే కొనుగోళ్లు
- 90 రోజుల పాటు అమల్లో కేంద్ర ఆంక్షలు
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం

పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాపై ఒత్తిడి పెరగడంతో కేంద్రం కఠిన చర్యలకు దిగింది. పెట్రోల్ బంకుల వద్ద భారీ స్థాయిలో డీజిల్ కొనుగోళ్లకు బ్రేక్ వేస్తూ, ఒక్కో వాహనానికి రోజుకు 200 లీటర్ల పరిమితి విధించింది. రిశ్రమలు, వాణిజ్య వినియోగదారులు ప్రత్యేక సరఫరా వ్యవస్థల నుంచే ఇంధనం కొనుగోలు చేయాలని ఆదేశిస్తూ, ఈ ఆంక్షలను 90 రోజుల పాటు అమలు చేయనుంది.

2 లో



## భారత నౌకలపై దాడి
# చేసింది ఇరాన్..

- హోర్ముజ్ జలసంధి ఘటనపై ఖండన వ్యక్తం చేసిన డొనాల్డ్ ట్రంప్
- ఇరాన్ డ్రోన్లతోనే దాడులు జరిగాయని 'ట్రూత్' వేదికగా వెల్లడి
- అమెరికాపై ఇరాన్ చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టిన ట్రంప్
- గతంలో భారత నౌకలపై జరిగిన దాడుల్లో ముగ్గురు మృతి, 21 మంది క్షేమం
- అమెరికానే దాడి చేసిందన్న ప్రచారానికి చెక్ పెడుతూ ఇరాన్ వైఖరిని తప్పుబట్టిన అమెరికా అధ్యక్షుడు

న్యూఢిల్లీ,

: హోర్ముజ్ జలసంధి వద్ద భారత నౌకలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడి ఇరాన్ పనే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. భారత నౌకలపై ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిందని, ఈ దాడి ఆమోదయోగ్యం కాదని ట్రంప్ అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా శుక్రవారం స్పందించారు. ఇంతవరకు భారత నౌకలపై దాడి చేసింది అమెరికానే అని ప్రచారం జరిగింది.దీనిపై ఇటు అమెరికా, అటు ఇరాన్ అధికారికంగా స్పందించలేదు. కానీ, తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. గత రాత్రి భారత నౌకపై జరిగిన ఈ దాడికి కారణం ఇరాన్ అన్నారు. ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిందని, ఈ దాడిని ట్రంప్ ఖండించారు. మరోవైపు అమెరికాతో ఒప్పందం కుదిరిందని ఇరాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని ట్రంప్ విమర్శించారు. ఈ విషయంలో ఇరాన్ తన వైఖరి మార్చుకోవాలని సూచించారు. భారత వాణిజ్య నౌకలపై జరిగిన దాడిలో 21 మందిని సహాయక బృందాలు రక్షించగా, ముగ్గురు మరణించారు. రెండుసార్లు భారత నౌకలపై దాడి జరిగింది. ఈ దాడికి కారణం అమెరికానే అని భావించిన భారత ప్రభుత్వం అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. అది కూడా రెండుసార్లు సమన్లు ఇచ్చింది. ఇదే సమయంలో ట్రంప్ స్పందించడం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా దాడి చేస్తోంది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడి చేస్తోంది. హోర్ముజ్ జలసంధి వద్ద చిక్కుకుపోయిన నౌకలపై జూన్ 8న తొలిసారి దాడి జరిగింది. ఆ తర్వాత గురువారం మరోసారి దాడి జరిగింది. ఈ దాడులు అమెరికానే చేసిందనే ప్రచారం మొదలైంది.

## తెలంగాణలో ఎవరైనా రాజకీయం
# చేసుకోవచ్చు

### శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ



- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి
- తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు
- కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు
- హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా
- మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్
- ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోను భేటీ

న్యూఢిల్లీ, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. -మిగతా 2 లో



## మీనాక్షికి సుప్రీంలో
# దక్కని ఊరట

- నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల ప్రక్రియ మధ్యలో జోక్యం చేసుకోలేమన్న సర్వోన్నత న్యాయస్థానం
- ఫలితాల అనంతరం హైకోర్టును ఆశ్రయించాలని సూచన
- రిటర్నింగ్ అధికారి నిర్ణయం ఏకపక్షమన్న అభిషేక్ మను సింఘ్వీ వాదనలు

న్యూఢిల్లీ జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల పక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. -మిగతా 2 లో

## రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు..!
# ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటీ?

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ అడ్డుకున్న అంశంపై సిట్ వేయాలి
- రాహుల్ గాంధీ తన పార్టీలోని 'బ్లాక్ షీప్'లను కనుక్కోవాలి
- కాంగ్రెస్‌లోని అంతర్గత కుట్రల్లోకి ప్రతిపక్షాలను లాగడం తగదు
- షబ్బీర్ అలీ వాస్తవాలు మాట్లాడారు.. పదవులు డబ్బులకే అమ్ముకుంటున్నారు
- రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం



2 లో




# మమతకు రెబల్ ఎంపీల షాక్

- మాదే అసలైన టీఎంసీ.. తమకే మెజారిటీ ఉందంటూ స్పీకర్ ఓం బిర్లాకు రెబల్స్ వినతిపత్రం
- కకోలి ఘోష్ నేతృత్వంలో ఒక గ్రూప్‌గా ఏర్పడిన 19 మంది ఎంపీలు
- ఎన్డీఏ కూటమికి మద్దతు ప్రకటిస్తామని బసునియా వెల్లడి
- తిరుగుబాటుదారుల జాబితాలో యూసుఫ్ పఠాన్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ
- మమతా బెనర్జీ నాయకత్వంపై విశ్వాసం ప్రకటించిన శత్రుఘ్న సిన్హా, సౌగతా రాయ్

కోల్‌కతా:

తృణమూల్ కాంగ్రెస్‌లో సంక్షోభం ముదురుతున్నది. అసలైన టీఎంసీ ఎవరిదన్న దానిపై పోరు తీవ్రమైంది. తమకే మెజారిటీ ఉన్నందున, అసలైన టీఎంసీ తమదేనని మమతా బెనర్జీపై తిరుగుబావుటా ఎగురవేసిన రెబల్ ఎంపీలు చెబుతున్నారు. -మిగతా 2 లో

# పాకిస్థాన్ నేవీలోకి కొత్త సబ్‌మెరైన్..



- చైనా నుంచి కరాచీ పోర్టుకు
- 8 జలాంతర్గాముల సరఫరా కోసం చైనాతో ఒప్పందం
- సాంకేతిక బదిలీ ద్వారా పాక్‌లోనే నాలుగింటి నిర్మాణం
- అత్యాధునిక స్టీల్త్ సామర్థ్యాలతో అమ్ములపొదిలోకి..

ఇస్లామాబాద్

పాకిస్థాన్ అమ్ములపొదిలోకి కొత్త జలాంతర్గామి వచ్చి చేరింది. హ్యాంగర్ క్లాస్ సబ్‌మెరైన్‌ను చైనాతో కలిసి ఆ దేశం సంయుక్తంగా నిర్మించింది. గురువారం కరాచీ పోర్టుకు ఆ సబ్‌మెరైన్ చేరుకున్నది. పాకిస్థాన్ నౌకాదళం ఆధునీకరణలో భాగంగా ఆ సబ్‌మెరైన్ వచ్చేసింది. పాకిస్థాన్ నేవీ డాక్‌యార్డ్‌కు చేరుకున్న సమయంలో రిసెప్షన్ సెర్మనీ నిర్వహించారు. కమాండర్ ఫ్లీట్ వైస్ అడ్మిరల్ అబ్దుల్ మునిబ్ చీఫ్ గెస్ట్‌గా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేవీ ఆఫీసర్లు, సిబ్బంది, కుటుంబసభ్యులు వెల్కమ్ కార్యక్రమంలో -మిగతా 2 లో

## స్వర్ణాంధ్రే శ్వాసగా
# పాలన సాగిస్తున్నాం

-మిగతా 3 లో

- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది
- రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు

2 లో



# సర్ ప్రక్రియ..
# ఓ భూతం లాంటిది

### చట్టం ముసుగులో కేంద్ర ప్రభుత్వం దొంగదారి: మంత్రి పొంగులేటి



**కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్ల తొలగింపునకు కుట్ర**

- ఓటు పోకుండా ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలి
- ఈడీ, సీబీఐల పేరుతో నేతలను లొంగతీసుకునేందుకు కేంద్రం యత్నం
- అగ్రనేత రాహుల్ గాంధీకి అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ఖమ్మం జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఎస్ఐఆర్ సర్ ఆనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు -మిగతా 2 లో



## రప్పా..రప్పా అంటే చూస్తూ
# ఊరుకునేది లేదు

- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్చాం
- మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు

తిరుపతి జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా -మిగతా 2 లో

# పెట్రోల్ బంకుల వద్ద భారీ డీజిల్ కొనుగోళ్లకు బ్రేక్

-ఒక్కో వాహనానికి 200 లీటర్లకే పరిమితి
-పరిశ్రమలు ప్రత్యేక సరఫరా వ్యవస్థల నుంచే కొనుగోళ్లు
-90 రోజుల పాటు అమల్లో కేంద్ర ఆంక్షలు
-పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం





**న్యూఢిల్లీ,**
పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ **శాఖ తాజా ఆదేశాలిచ్చింది.** పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

# మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

మొదటి తరువాయి

జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల ప్రక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

# మమతకు రెబల్ ఎంపీల షాక్




తమ గ్రూప్‌నే అసలైన టీఎంసీగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విన్నవించనున్నారు. ఈ సందర్భంగా రెబల్ ఎంపీ జగదీశ్ చంద్ర బర్మా బసునియా మాట్లాడుతూ రెబల్ ఎంపీలు ఇప్పటికే స్పీకర్ బిర్లాకు వినతిపత్రం సమర్పించారని, దీనిపై సోమవారం అధికారిక ప్రకటన రావచ్చునని తెలిపారు. కాగా, టీఎంసీ ఎంపీ కకోలి ఘోష్ నేతృత్వంలో 19 మంది అసమ్మతి ఎంపీలు ఇప్పటికే ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. సభలో పార్టీ విప్‌గా దస్తీదార్ కొనసాగుతారని వారు స్పీకర్‌కు సమర్పించిన లేఖలో పేర్కొన్నారు.
మేం బిర్లాకు లేఖ సమర్పించాం. సోమవారం ఆయనను వ్యక్తిగతంగా కలిసి మాదే అసలైన టీఎంపీ పార్లమెంటరీ గ్రూప్ అని తెలిపి, మమ్మల్ని గుర్తించమని విజ్ఞప్తి చేస్తాం' అని బసునియా పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే రెబల్ ఎంపీలతో ప్రత్యేక గ్రూప్‌గా ఏర్పడిన క్రమంలో తాము బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మద్దతు ప్రకటిస్తామని ఆయన ప్రకటించారు. శానసకర్తలను పక్షం మారేలా ప్రేరేపిస్తున్నారు అంటూ టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ ఆయనో అబద్ధాలకోరు అని బసునియా వ్యాఖ్యానించారు. తాము 19 మంది ఎంపీలం ఉన్నామని, ఒక ఎంపీగా కీర్తి ఆజాద్ అలాంటి విమర్శలు చేయడం తగదని అన్నారు.

**రెబల్స్‌లో యూసుఫ్ పఠాన్, కకోలి ఘోష్**
తమ పార్టీ అధిష్ఠానంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు 19 మంది లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఒక లేఖను సమర్పించారు. మే 18న సమర్పించిన లేఖపై సంతకం చేసిన వారిలో ఎంపీలు సాయోని ఘోష్, శతాబ్ది రాయ్, యూసుఫ్ పఠాన్, రచనా బెనర్జీ తదితరులు ఉన్నారు. కాగా, గురువారం మరో టీఎంసీ రాజ్యసభ ఎంపీ పార్టీకి రాజీనామా చేశారు. ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కాగా, టీఎంసీలో సీనియర్ నేతలైన శత్రుఘ్న సిన్హా, బాబుల్ సుప్రియో, సౌగతా రాయ్‌లు మమత నాయకత్వంపై తమ విశ్వాసాన్ని ప్రకటించారు.

# తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు

మొదటి తరువాయి

తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టంచేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు..! ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటీ?

-మీనాక్షి నటరాజన్ నామినేషన్ అడ్డుకున్న అంశంపై సిట్ వేయాలి
-రాహుల్ గాంధీ తన పార్టీలోని 'బ్లాక్ షీప్'లను కనుక్కోవాలి
-కాంగ్రెస్‌లోని అంతర్గత కుట్రల్లోకి ప్రతిపక్షాలను లాగడం తగదు
-షబ్బీర్ అలీ వాస్తవాలు మాట్లాడారు.. పదవులు డబ్బులకే అమ్ముకుంటున్నారు
-రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం

**హైదరాబాద్ :**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' (పార్టీ ద్రోహులు) ఎవరో కనుక్కోవాలి.



కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికి ఇది ఆయన కుట్రనే..తెలంగాణ ప్రభుత్వ అప్పులు ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినం దుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు.

# సర్ ప్రక్రియ..ఓ భూతం లాంటిది

మొదటి తరువాయి

మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్టాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం




**తిరుపతి,**
స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం.

# పాకిస్థాన్ నేవీలోకి కొత్త సబ్‌మెరైన్..

మొదటి తరువాయి

పాల్గొన్నట్లు పాకిస్థాన్ నేవీ ప్రకటన చేసింది.పాకిస్థాన్ నేవల్ అకాడమీకి చెందిన క్యాడెట్లు సంప్రదాయ సెల్యూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎన్ జెడ్9ఈసీ హెలికాప్టర్లతో ఫ్లై పాస్ట్ చేపట్టారు. 2015లో కుదిరిన ఒప్పందం ప్రకారం .. చైనాలోనే హ్యాంగర్ క్లాస్ సబ్‌మెరైన్‌ను నిర్మించారు. మొత్తం 8 జలాంతర్గాములను పాకిస్థాన్‌కు అందించాలని గతంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. చైనాకు చెందిన సీఎస్ఐసీ కంపెనీ మొదటి నాలుగు సబ్‌మెరైన్లను నిర్మిస్తోంది. మిగితా నాలుగు సబ్‌మెరైన్ల నిర్మాణం, అసెంబ్లింగ్ పాకిస్థాన్‌లో జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ పద్ధతిలో కరాచీ షిప్‌యార్డులో వాటిని నిర్మించనున్నారు. హ్యాంగర్ అనే పదాన్ని బెంగాలీ నుంచి తీసుకున్నారు. దీనికి షార్క్ అని అర్థం వస్తుంది. 1971 కన్నా ముందున్న పరిస్థితులను గౌరవిస్తూ ఆ పేరు పెట్టినట్లు తెలుస్తోంది. 1971 కన్నా ముందు బంగ్లాదేశ్ .. పాకిస్థాన్‌లో భాగంగా ఉండేది. వాస్తవానికి ఒరిజినల్ హ్యాంగర్‌ను ఫ్రెంచ్ నిర్మిత డఫేన్ క్లాస్ సబ్‌మెరైన్‌గా గుర్తిస్తారు. పాకిస్థాన్ నేవీలో ఆ తరహా అటాక్ సబ్‌మెరైన్లు ఉన్నాయి. అయితే ఆధునిక హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాముల్లో చాలా అడ్వాన్స్ ఫీచర్లు ఉంటాయి. వీటికి స్టీల్త్ సామర్థ్యం కూడా ఉంటుంది.

# రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

మొదటి తరువాయి



మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కార్మిక శాఖ రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు చదువుకునేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల కార్మికులు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కోలా ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ సభ్యత్వ అవగాహన సభ



**హుజురాబాద్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జమ్మికుంట పట్టణంలోని ఎంఫిఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటర్ నమోదు అవగాహన సమావేశం గులాబీ శ్రేణుల మహాసంగ్రామ సభలా మారింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, జీవన్ రెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాకేష్ కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్ తదితరులు హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధన నుంచి అభివృద్ధి వరకు బిఆర్ఎస్ పాత్ర చిరస్థాయిగా నిలిచిందని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమం--అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేసిన పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని, రానున్న రోజుల్లో గులాబీ జెండా మరింత బలంగా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు, దళితబంధు పెండింగ్ నిధులు, హుజురాబాద్ డంపింగ్ యార్డ్ అంశాలను ప్రస్తావిస్తూ ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ ఎప్పుడూ పోరాడుతుందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని కౌశిక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ డిమాండ్

**ఖానాపూర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఆమోదించిన ఫీజు వివరాలను నోటీసు బోర్డులు, వెబ్‌సైట్లలో ప్రదర్శించాల్సి ఉన్నప్పటికీ, అనేక సంస్థలు పాటించడం లేదని విమర్శించారు. హైదరాబాద్, ఖమ్మం, ఇతర ప్రాంతాల్లో ఫీజులు భారీగా పెరిగిన ఉదాహరణలను ప్రస్తావిస్తూ, యూనిఫాం, పుస్తకాలపై కూడా అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజు నియంత్రణ చట్టం తరహాలో తెలంగాణలో కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయకపోవడం దారుణమని, వెంటనే విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి పేద, బలహీన వర్గాలపై భారాన్ని తగ్గించాలని జగన్ మోహన్ స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేసి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని బీఎస్పీ నేతలు డిమాండ్ చేశారు.

# ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా విలాస్



**ఖానాపూర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖానాపూర్ మండలంలోని ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా గోసం పల్లె గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ విలాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా దిలావర్పూర్ గ్రామ పంచాయతీ పోరగంటి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా మస్కాపూర్ గ్రామానికి చెందిన దొరికిని వెంకటేష్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ మండలంలోని 25 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు పాల్గొన్నారు. ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా విలాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ పిలుపు



**గన్నేరువరం, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతీయ జనతా పార్టీ గన్నేరువరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక హై స్కూల్ గ్రౌండ్‌లో టిఫిన్ బైఠక్ కార్యక్రమం జరిగింది. మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు (జూన్ 13) జరగనున్న స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ అరికాంతపు అనిల్, మచ్చ బాల్రాజ్, మండల ప్రధాన కార్యదర్శులు పుల్లల రాము, బొమ్మడి సురేందర్ రెడ్డి, కార్యదర్శి బూట్ల సంపత్, కార్యవర్గ సభ్యులు జాలి శ్రీనివాసరెడ్డి, నందికొండ సురేందర్ రెడ్డి, మునిగంటి లింగయ్య, కార్యకర్తలు గట్టు కిషన్, బోగిని వేణు, చింతల శ్రీనివాస్, బోయిని మధు తదితరులు పాల్గొన్నారు. జూన్ 13న స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ పిలుపునిచ్చారు.

# రెండు రోజుల్లో స్వదేశానికి మృతదేహాలు



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దుబాయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గ వాసుల మృతదేహాలను రెండు రోజుల్లో స్వదేశానికి తరలించనున్నట్లు ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం తెలిపారు. దుబాయ్‌లోని ఎం.బి.సి అధికారులతో సమావేశమైన ఆయన, మృతదేహాల తరలింపులో సాంకేతిక అంశాలను పూర్తి చేసి త్వరలో భారత్‌కు పంపిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రషీద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్యంపేటకు చెందిన సయ్యద్‌ను ఎమ్మెల్యే పరామర్శించి, తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. త్వరలోనే భారత్‌కు తిరిగి రావడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. దుబాయ్ ప్రమాద బాధితుల మృతదేహాలు రెండు రోజుల్లో స్వదేశానికి చేరనున్నాయి.

# ప్రజలను ఆకట్టుకున్న చిరుతల రామాయణ నాటక ప్రదర్శన



**హుస్నాబాద్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో రెండు రోజుల పాటు చిరుతల రామాయణ నాటక ప్రదర్శన వైభవంగా జరిగింది. బోధకుడిగా శనిగరం మల్లేశం వ్యవహరించారు. గ్రామ సర్పంచ్ మార్క రాజ్‌కుమార్ గౌడ్, కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ కళాకారులు, ప్రజల సహకారంతో రామాయణ గాధను పాత్రల వేషధారణ, పద్యాలు, పాటలతో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో గ్రామ ఉపసర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్, వార్డ్ మెంబర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు. బింగి లక్ష్మీనారాయణ, చీకుట్ల రాజు, గూళ్ళ సంపత్, గూడెపు రామస్వామి, దరిపెల్లి మల్లేష్, వేమునూరు సంపత్, గూడెపు ఆంజనేయులు తదితరులు వివిధ పాత్రల్లో నటించి ప్రేక్షకులను మైమరిపించారు. సుందరగిరి, చిగురుమామిడి, నవాబుపేట, గొట్లమిట్ట, హుస్నాబాద్, గాగిరెడ్డిపల్లి, పొట్లపల్లి గ్రామాల కళాకారులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు. కొండాపూర్‌లో చిరుతల రామాయణ ప్రదర్శన గ్రామ ప్రజలను ఆకట్టుకుంది.

# పత్తి మార్కెట్ యార్డుకు మూడు రోజుల సెలవులు

**హుజురాబాద్ , జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డుకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. జూన్ 13 శనివారం వారాంతపు సెలవు, జూన్ 14 ఆదివారం సాధారణ సెలవు, జూన్ 15 సోమవారం అమావాస్య సందర్భంగా మార్కెట్ యార్డు బంద్‌గా ఉంటుంది. తిరిగి జూన్ 16 మంగళవారం నుంచి మార్కెట్ యార్డు కార్యకలాపాలు పునఃప్రారంభమవుతాయని మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు. రైతులు ఈ మూడు రోజులలో తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తరలించవద్దని సూచించారు. జూన్ 13 నుంచి 15 వరకు మార్కెట్ యార్డు బంద్ -- జూన్ 16న పునఃప్రారంభం.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్ రూరల్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు రెండు ట్రాక్టర్లను అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుకున్నారు. చేగుర్తి గ్రామానికి చెందిన చామనపల్లి శ్రీనివాస్ మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి ట్రాక్టర్‌లో కరీంనగర్ వైపు తరలిస్తుండగా తీగలగుట్టపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే కిసాన్ నగర్‌కు చెందిన వీర్ల సంపత్ మానేరు వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని చల్మెడ ఆసుపత్రి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో యాసంగి 2025–26 సీజన్‌కు సంబంధించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ. 1,031 కోట్ల విలువైన ధాన్యం సేకరించామని, ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని చెప్పారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొన్నారు. జిల్లాలో 18,191 ఎకరాల్లో సాగిన మొక్కజొన్నను తొమ్మిది కేంద్రాల ద్వారా 26 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ. 63.40 కోట్ల విలువైన చెల్లింపులు చేసినట్లు తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పారదర్శకంగా కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించబోమని, ఇప్పటికే పెద్ద ఎత్తున భూములను స్వాధీనం చేసుకున్నామని, దశలవారీగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పెద్దపల్లి, రామగుండం ఏటీసీలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, దరఖాస్తుల సమర్పణకు జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష వెల్లడించారు.

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని తపస్ డిమాండ్



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశిరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు 2025 సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పు, అనంతరం 65 రివ్యూ పిటిషన్లను కొట్టివేసి 2028 ఆగస్టు 31 వరకు చివరి అవకాశాన్ని ఇచ్చిన తీర్పు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నదని వారు పేర్కొన్నారు. తెలంగాణలో 30 వేల మంది ఉపాధ్యాయులు టెట్ పాస్ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. భాషా ఉపాధ్యాయులు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు తమ బోధనకు సంబంధం లేని సబ్జెక్టులు చదివి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉందని, ఇది అసంబద్ధ నిర్ణయమని తపస్ అభిప్రాయపడింది. ఇప్పటికే ఎన్సిఆర్టి, ఎస్సిఈఆర్టి ఆధ్వర్యంలో దీక్ష, నిష్ఠ వంటి ఆన్లైన్ శిక్షణలు అందుతున్నాయని, ఉపాధ్యాయులు సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా నేర్చుకుంటున్నారని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి 2010 ఏప్రిల్ 1కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని ఒప్పించేలా చర్యలు తీసుకోవాలని తపస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో తపస్ రాష్ట్ర బాధ్యులు సత్తారి రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ, మంచాల మండల అధ్యక్షుడు రావుల శివకుమార్, ప్రధాన కార్యదర్శి కావలి దత్తాత్రేయ, కోశాధికారి చీర బలరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోసం తపస్ కేంద్రాన్ని ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేసింది.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- డీడబ్ల్యూఓ సరస్వతి**



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, పోలీసు శాఖ, జిల్లా న్యాయ సేవా సంస్థ సమన్వయంతో కరీంనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కార్మిక శాఖ అధికారి ప్రసాద్ ర్యాలీని జిల్లా పరిషత్ కార్యాలయం నుండి ప్రారంభించారు. గీతాభవన్ చౌరస్తా వరకు కొనసాగిన ర్యాలీ సందర్భంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలలో ఆకస్మిక తనిఖీలు చేసి బాల కార్మికులు పనిచేస్తున్నారా అని పరిశీలించారు. బాల కార్మికులు లేని దుకాణాలకు బాల కార్మికుల రహిత దుకాణం స్టిక్కర్లు అంటించారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రతినిధి చంద్రప్రకాశ్ రెడ్డి, సీడీపీఓలు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, బాలల పరిరక్షణ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, పోలీసు టాస్క్ ఫోర్స్ పాల్గొన్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

## చిట్‌ఫండ్ కంపెనీలపై న్యాయవాది ఫిర్యాదు

**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలోని కొన్ని చిట్‌ఫండ్ సంస్థలు, ముఖ్యంగా కపిల్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ అమలు పిటిషన్లలో చట్టబద్ధమైన విధానాలను పాటించడం లేదని ఆరోపిస్తూ న్యాయవాది ఎ.వి. రమణ జిల్లా ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు.నోటీసులు సక్రమంగా జారీ చేయకుండా, చందాదారులు మరియు షూరిటీలకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా వారెంట్లు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, అమాయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.చిట్‌ఫండ్ కంపెనీలు దాఖలు చేస్తున్న అమలు పిటిషన్లలో నోటీసుల జారీ, సర్వీస్ విధానం, వారెంట్ల జారీ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి చట్టబద్ధమైన విధానాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చిట్‌ఫండ్ సంస్థలపై న్యాయవ్యవస్థ ప్రత్యేక దృష్టి సారించాలని న్యాయవాది ఎ.వి. రమణ కోరారు.

## సిబిఎఫ్సి అడ్వైజరీ మెంబర్‌గా కొమ్మెర రవీందర్ రెడ్డి నియామకం

**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



సెంట్రల్ బోర్డ్ ఫిలిం సర్టిఫికేషన్ అడ్వైజరీ మెంబర్‌గా నియమితులైన కొమ్మెర రవీందర్ రెడ్డిని శాన్వి డిఫెన్స్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రం శెట్టి మునీందర్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కలల పట్ల ఆసక్తి, సృజనాత్మకత, సమాజ స్పృహతో అర్థవంతమైన విద్యను నేర్చుకోవాలని సూచించారు. దేశభక్తి, శ్రద్ధలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకుంటే భారతదేశం జగద్గురు స్థానంలో నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. సిబిఎఫ్సి మెంబర్‌గా నియమితులైన కొమ్మెర రవీందర్ రెడ్డికి శాన్వి డిఫెన్స్ అకాడమీ ఘన సన్మానం చేసింది.

## ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం

**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ చాడగొండ కవితా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక వసతులు, విశాలమైన ఆటస్థలం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని ఆమె పేర్కొన్నారు. స్థానిక నాయకుడు చాడగొండ బుచ్చిరెడ్డి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రజలను ప్రోత్సహించారు.ప్రధానోపాధ్యాయుడు మురుమూరి రాజేందర్ మాట్లాడుతూ జూన్ 15న పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయని, కావలసిన పుస్తకాలు, నోటుపుస్తకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐఎఫ్పి ప్యానెల్స్‌తో నూతన తరగతి గదులు, ఆధునిక సాంకేతిక బోధన కొనసాగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ, ఉపాధ్యాయులు గాజుల రవీందర్, తూముల తిరుపతి, సిహెచ్ శ్రీనివాస్, జి. ప్రసాద్ రావు, శంకరయ్య, భారతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కార్పొరేటర్ కవితా బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు.

## తక్షణ చర్యలతో సులభంగా మారిన రాకపోకలు



**కరీంనగర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మారుతీనగర్‌లోని వెంకట్ సాయి థియేటర్ పక్క గల్లీలో భారీ వేప చెట్టు ఒక్కసారిగా కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే 36వ డివిజన్ కార్పొరేటర్ తోట అనిల్ స్థానిక నాయకుడు ప్రశాంత్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మున్సిపల్ సిబ్బందిని రంగంలోకి దించారు. చెట్టు కొమ్మలను నరికివేసి రహదారిపై నుండి తొలగించే పనులను స్వయంగా పర్యవేక్షించారు. తక్షణ చర్యలతో ట్రాఫిక్ పునరుద్ధరించడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.మారుతీనగర్‌లో కూలిన వేప చెట్టును తక్షణమే తొలగించి రాకపోకలు సులభతరం చేశారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో పి.శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శాతవాహన విశ్వవిద్యాలయం కళలు, సామాజికశాస్త్ర కళాశాల అర్థశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి పి. శ్రీనివాస్‌కు డాక్టరేట్ డిగ్రీ లభించింది. పెద్దపల్లి జిల్లాలో వ్యవసాయ కార్మికుల సామాజిక ఆర్థిక పరిస్థితులు అనే అంశంపై ఆయన ఆచార్య వరప్రసాద్ పర్యవేక్షణలో పరిశోధన చేసి, బహిరంగ మౌఖిక పరీక్షలో విజయవంతమయ్యారు.ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి డా. డి. సురేష్‌కుమార్ డిగ్రీ మంజూరైనట్లు ప్రకటించారు. పరిశోధనలో సహకరించిన అర్థశాస్త్ర విభాగాధిపతి డా. కే. శ్రీవాణి, ఉపకులపతి ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్ సతీష్‌కుమార్, అధ్యాపకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.పి. శ్రీనివాస్ పరిశోధనతో శాతవాహన విశ్వవిద్యాలయం మరో శాస్త్రీయ ముందడుగు వేసింది.

## జిల్లా విద్యాధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆంగ్ల ఉపాధ్యాయులు



**హుస్నాబాద్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సిద్దిపేట జిల్లా కొత్తగా నియమితులైన విద్యాధికారి ఓరుగంటి శాస్త్రిని ఆంగ్ల ఉపాధ్యాయుల అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. విద్యార్థుల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్లానింగ్ కోఆర్డినేటర్ పయ్యావుల రామస్వామి, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ దొంతుల నర్మద, అసోసియేషన్ అధ్యక్షుడు పంజ రాజమల్లు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, ఉపాధ్యక్షుడు ఎర్ర పార్థసారథి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ముత్యాల సురేందర్ రెడ్డి, మానుక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల అకాడమిక్ అభివృద్ధికి కృషి చేస్తామని ఆంగ్ల ఉపాధ్యాయులు డీఈఓకి హామీ ఇచ్చారు.

## బీజేపీ టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు

**మానకొండూర్--హుస్నాబాద్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు నిర్వహించారు. మానకొండూర్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో జరిగిన సమావేశంలో బీజేపీ నాయకులు అప్పని తిరుపతి, సోన్నకుల శ్రీనివాస్, భాష బోయిన ప్రదీప్ యాదవ్, మీసా రమణయ్య, మార్కొండ రమేష్ పటేల్, నందగిరి బలరాం తదితరులు పాల్గొన్నారు. రేపు జరగనున్న స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంపై చర్చించారు. హుస్నాబాద్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రేకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి గ్రామస్తులు, కార్యకర్తలతో కలిసి టిఫిన్ బైఠక్‌లో పాల్గొన్నారు. ఆయన స్వయంగా ఇంటి నుంచి తెచ్చుకున్న అల్పాహారంతో ప్రజలతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిశుభ్రత, అభివృద్ధి అంశాలపై ఉపాధ్యాయులు, గ్రామస్తులతో చర్చించారు.ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, కుల సంఘాల భవనాలకు రూ.20 లక్షల సాయం ప్రకటించారు. తొలి విడతగా రూ.10 లక్షలు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

## మన బడి- మన బాధ్యత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- వాసలా రమేష్**



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల సేవా స్ఫూర్తితో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించిన మన బడి -- మన బాధ్యత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాసలా రమేష్, వేముల కవితా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచి పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ప్రజలను కోరారు.నగరంలోని 39వ డివిజన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరగబోయే స్వచ్ఛ పాఠశాల కార్యక్రమానికి ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పరిశీలించారు. పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించిన అనంతరం ప్రజలతో కలిసి టిఫిన్ బైఠక్ నిర్వహించి రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చర్చించారు. ఈ సందర్భంగా 38వ డివిజన్ కార్పొరేటర్ సరస్వతి సత్యం, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ ప్రజలంతా పాఠశాలల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత, అభివృద్ధి కోసం ప్రజలంతా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.

## పాఠశాల పునఃప్రారంభానికి ముందే సౌకర్యాలు సిద్ధం చేయాలి

**-అదనపు కలెక్టర్ డా. అశ్వని తానాజీ వాకడే**



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లా అదనపు కలెక్టర్ డా. అశ్వని తానాజీ వాకడే ఎలగందల్, కొత్తపల్లి మండలంలోని విద్యాసంస్థలను సందర్శించి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు.ఎలగందల్ మోడల్ స్కూల్, జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భవనాల మరమ్మతులు వంటి అంశాలను సమీక్షించారు. గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ పర్యవేక్షణలో టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్‌కుమార్, ప్లానింగ్ సమన్వయాధికారి మిలుకూరి శ్రీనివాస్, కొత్తపల్లి మండల విద్యాధికారి తుమ్మా ఆనందం తదితరులు పాల్గొన్నారు.పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే అన్ని వసతులు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

## మన బడి -మన బాధ్యత ఏర్పాట్లను పరిశీలోంచిన - మేయర్ కొలగాని శ్రీనివాస్


**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



నగరపాలక సంస్థ పరిధిలోని తీగలగుట్టపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరగనున్న మన బడి -- మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమ ఏర్పాట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన టిఫిన్ బైఠక్‌లో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణ, పరిసరాలను సందర్శించి పరిశుభ్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను సమీక్షించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండటం విద్యార్థుల ఆరోగ్యానికి, విద్యాభివృద్ధికి అవసరమని మేయర్ పేర్కొన్నారు. రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.తరువాత నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేసి స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.పాఠశాలల పరిశుభ్రత, అభివృద్ధి కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## గొర్రెలు, మేకల ఆరోగ్య రక్షణకై గాలి టీకాల పంపిణీ

**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో గొర్రెల కాపర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు గాలి టీకాలు పంపిణీ చేశారు.సంఘం అధ్యక్షుడు బండి మల్లయ్య యాదవ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని గొర్రెల కాపరి రైతులు ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ భారతి, వి.ఎ.ఎస్.పి. రజిత, మేడంజె వి.ఓ., గ్రామ ప్రధాన కార్యదర్శి దాడి పెద్ద లచ్చయ్య యాదవ్, స్థానిక గొర్రెల కాపరి రైతులు పాల్గొన్నారు.గొర్రెలు, మేకల ఆరోగ్య రక్షణ కోసం గాలి టీకాలు పంపిణీ చేశారు.

# ఇందిరా మహిళా శక్తి యూనిట్ల పరిశీలన



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరపాలక సంస్థ పరిధిలోని 17, 18వ డివిజన్లలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి యూనిట్లను మెప్మా పీడీ స్వరూప రాణి సందర్శించారు.మహిళా సభ్యులతో మాట్లాడి ఆదాయాభివృద్ధి కోసం సూచనలు చేశారు. అనంతరం లోక్ కళ్యాణ్ మేళా భాగంగా నిర్వహించిన వారసంతలో వీధి విక్రయదారుల గుర్తింపు కార్యక్రమంలో పాల్గొని రుణాల పంపిణీపై సమీక్షించారు. తదుపరి ఆర్‌పీలు, ఆఫీస్ బేరర్స్‌తో సమావేశం నిర్వహించి సంఘ సమావేశాలు క్రమం తప్పకుండా జరపాలని, రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మహిళా కాంటీన్, భర్తన్ బ్యాంక్, విజయ డెయిరీ అవుట్‌లెట్ వంటి ఆదాయ వనరులను ఒక నెలలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, సీఓ మంజుల, ఆర్‌పీలు, పట్టణ సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం కొత్త ఆదాయ వనరులు ఏర్పాటు చేయాలని మెప్మా పీడీ స్వరూప రాణి సూచించారు.

# క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

- మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరపాలక సంస్థ, జిల్లా యువజన క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు అవసరమని, అవి శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. మే 11న అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమైన శిబిరం జూన్ 12 వరకు కొనసాగి, 17 క్రీడా అంశాలలో 28 మంది కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ అందించగా, 1400 మంది బాలబాలికలు పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు.విద్యార్థులకు పౌష్టికాహారం, కోచ్‌లకు గౌరవ వేతనం అందించామని, భవిష్యత్తులో కరీంనగర్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించేలా వసతులు కల్పిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. ప్రతిరోజూ సాయంత్రం 3--5 ప్రధాన క్రీడా అంశాలలో నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్ రవీందర్ సింగ్, అదనపు కలెక్టర్ సువార్త, మహమ్మద్ ఆయాజ్, డైసో శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జనార్ధన్ రెడ్డి, సజిఫ్ సెక్రటరీ వేణుగోపాల్, అధికారులు, కో-ఆప్షన్ సభ్యులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.

# భారీ వర్షంతో 53వ డివిజన్ జలమయం

**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలో కురిసిన భారీ వర్షం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ఒక్కసారిగా దంచికొట్టిన వానతో పలు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రత్యేకంగా 53వ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లి ఇళ్ల ముందు వరకూ నీరు చేరింది.మురుగునీరు సక్రమంగా పారకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భారీ వర్షంతో 53వ డివిజన్ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



# నీట్, ఐఐటి అవకతవకలపై ఎన్ఎస్‌యుఐ నిరసన

**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రతిష్టాత్మక నీట్, ఐఐటి పరీక్షల్లో అవకతవకలు జరగడం దేశ ప్రతిష్టకు భంగమని కాంగ్రెస్ నేత అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ చౌక్ వద్ద ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ జరిగింది.నీట్ పరీక్ష రద్దు అవమానకరమని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ఐఐటి అడ్వాన్స్‌డ్ పేపర్ లీక్ చరిత్రలో తొలిసారి జరగడం బాధాకరమని, ప్రశ్నపత్రాల సిద్ధతలో నిర్లక్ష్యం వహించిన ఐఐటి రూర్కీపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన ధర్నా




ప్రభుత్వానికి గుణపాఠం కావాలని, పరీక్షల నిర్వహణలో సాంకేతిక లోపాలు, పర్యవేక్షణ లోపం విద్యా వ్యవస్థను కుదేలుచేస్తున్నాయని నేతలు విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మోడీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, యువజన కాంగ్రెస్ నేతలు కిమ్ ఫహద్, గుర్రం వాసు గౌడ్, రెహమాన్, రమేష్, విక్రమ్, ఎండి అయాన్, చేతన్ రెడ్డి, సోఫియాన్ అన్సారీ, అనిల్, రేవంత్, మహాలక్ష్మి, చింతల శ్రీనివాస్ రెడ్డి, సమ్మిరెడ్డి, ద్యావ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నీట్, ఐఐటి పరీక్షల్లో అవకతవకలు దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

# మౌలిక సదుపాయాల అభివృద్ధియే లక్ష్యం

- - మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మేయర్ కొలగాని శ్రీనివాస్ పలు పనులకు శంకుస్థాపన చేశారు. 1వ డివిజన్ అరెపల్లిలో రూ.27 లక్షల వ్యయంతో సీసీ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనుల ద్వారా ప్రజలకు మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం 26వ డివిజన్‌లో పూడికతీత పనులను ప్రారంభించి వర్షాకాలానికి ముందే కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నగర అభివృద్ధే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం పనిచేస్తోందని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, కార్పొరేటర్ బండారి వేణు, కో-ఆప్షన్ సభ్యులు చిగిరి వెంకటమ్మ, సరిల్ల ప్రసాద్, కొంపల్లి రమణ్, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు. ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా పనులు వేగవంతం చేస్తున్నామని మేయర్ స్పష్టం చేశారు.

# సినారె 9వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**హుస్నాబాద్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, రచయిత డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారె) 9వ వర్ధంతి సందర్భంగా సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. సినారె చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించిన పిడిశెట్టి రాజు మాట్లాడుతూ, తెలంగాణ మట్టిలో పుట్టి తెలుగు సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి సినారె అని కొనియాడారు. ఆయన రచించిన విశ్వంభర మహాకావ్యానికి 1988లో జ్ఞానపీఠ అవార్డు లభించిందని, పద్మశ్రీ, పద్మవిభూషణ్ పురస్కారాలతో భారత ప్రభుత్వం సత్కరించిందని గుర్తుచేశారు.తెలుగు సినీ రంగంలో వేలాది గీతాలను రచించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని, రాజ్యసభ సభ్యునిగా కూడా సేవలందించిన సినారె సాహిత్యం, సంస్కృతి, భాషా వికాసానికి విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన రచనలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయని, యువత తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెంపొందించేందుకు సినారె రచనలను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వేముల శ్రీనివాస్, కోడల రాజిరెడ్డి, కోహెడ వెంకటేష్, మైనారిటీ నాయకులు షేక్ వలి సాబ్, ఎస్. రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.తెలుగు జాతికి గర్వకారణమైన సినారె సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

# దుబాయిలో బుర్జీల్ ప్రతినిధులను ఎమ్మెల్యే సత్యం భేటి



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికులు, గాయపడిన తొమ్మిది మందికి బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్ డా. షంషీర్ వయలిల్ ప్రకటించిన రూ. 2.60 కోట్ల మానవతా సహాయ ప్యాకేజీపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.డా. షంషీర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కంపెనీ ప్రతినిధులను దుబాయిలో కలిసిన ఎమ్మెల్యే సత్యం, సహాయం కోసం కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ. 26 లక్షలు, గాయపడిన వారికి వైద్య చికిత్స, పునరావాసం, పిల్లల విద్య కోసం సహాయం అందించనున్నట్లు ప్రకటించారు.ఎమ్మెల్యే సత్యం బుర్జీల్ ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించి, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో చెక్కులు అందజేయాలని ప్రతిపాదించారు. అంతకుముందు ఆయన భారత కాన్సులేట్ అధికారులను కలసి మృతదేహాల తరలింపు వేగవంతం చేయాలని కోరారు, రషీద్ ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు, తెలంగాణ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 26 లక్షల సహాయం అందనున్నది.

# సంక్షేమ శాఖల్లో అవినీతి నిరూపిసే సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్



**హుస్నాబాద్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు.మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకతతోనే నిర్ణయాలు తీసుకుంటున్నామని, మంత్రులకు సంబంధం లేకుండా ప్రిన్సిపల్ సెక్రటరీల ఆధ్వర్యంలోనే వ్యవహారాలు జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడి తన స్థాయి తగ్గించుకుంటున్నారని విమర్శిస్తూ, గత ప్రభుత్వంలో జరిగినట్లుగా అవినీతి జరుగుతుందనే భావన తప్పు అని అన్నారు.అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడుతూ, సంక్షేమ శాఖల్లో అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. పేదల విద్య, నాణ్యమైన ఆహారం కోసం మాత్రమే మేము కృషి చేస్తున్నామని, మా శాఖల్లో తప్పు జరిగిందని నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు.హరీష్ రావు ఆరోపణలు నిరాధారమని, అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.

# విజయవంతంగా స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం




**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు రేపు జరగనున్న స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కరీంనగర్ జిల్లా శాఖ పిలుపునిచ్చింది. జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మౌలిక సౌకర్యాలు కల్పించడంలో సమాజం భాగస్వామ్యం కావాలని కోరారు.గత సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ, పరీక్ష ఫీజులు చెల్లింపు, పాఠశాల క్లబ్బులకు టీషర్టులు అందజేయడం వంటి కార్యక్రమాలను గుర్తుచేసి, విద్యారంగంపై మంత్రి బండి సంజయ్ చూపిన విశాల దృక్పథాన్ని సమావేశం ప్రశంసించింది.సమాజంలోని అన్ని వర్గాలు కలిసి స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తపస్ జిల్లా శాఖ పిలుపునిచ్చింది.

# మన బడి - మన బాధ్యత ఏర్పాట్ల పరిశీలన



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నగరంలోని 39వ డివిజన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరగబోయే మన బడి -- మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పరిశీలించారు.పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించిన అనంతరం ప్రజలతో కలిసి 'టిఫిన్ బైఠక్' నిర్వహించి రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే అంశంపై చర్చించారు.ఈ కార్యక్రమంలో 38వ డివిజన్ కార్పొరేటర్ సరస్వతి సత్యం, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ పాల్గొని, పాఠశాలల పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పాఠశాలల పరిశుభ్రత, పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కార్పొరేటర్లు సూచించారు.

# బట్ట సంచుల పంపిణీ




**సిద్దిపేట, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై అవగాహన కార్యక్రమం సిద్దిపేట పట్టణంలో జరిగింది.మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో బట్ట సంచులు పంపిణీ చేసి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది వ్యాపారులు, షాపు యజమానులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, గాలి కాలుష్యానికి కారణమవుతున్నాయని, వాటికి ప్రత్యామ్నాయంగా బట్ట సంచులు, నార సంచులు, చెక్క స్పూన్లు, స్టీల్ బాటిళ్లు, ఇస్తరి ఆకుల ప్లేట్లు వాడాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రజలు తడి, పొడి, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని, ఇది పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని తెలిపారు.వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను వాడతామని హామీ ఇచ్చారు. అనంతరం పాల్గొన్న వారందరికీ బట్ట సంచులు పంపిణీ చేశారు.పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# మున్సిపల్‌లో అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మున్సిపల్ పనుల్లో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు ప్రభుత్వాన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే చేసిన పనులను మళ్లీ టెండర్లలో చేర్చి ప్రజా ధనాన్ని దోచుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విధంగా రిపీటెడ్ వర్క్స్ అనేకంగా ఉన్నాయని, ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపితే అవినీతి బయటపడుతుందని పేర్కొన్నారు.చేసిన పనులకు మళ్లీ టెండర్లు వేసి బిల్లులు గుంజాలని చూసిన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని, సంబంధిత కమిషనర్, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఈ అవినీతిపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ అవినీతిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు.

# కుక్కల బెడదతో రైతులు , ప్రజలు బెంబేలెత్తుతున్నారు

-నాటు కోళ్లు, దూడలు, గొర్రె పిల్లలపై దాడులు

- వాహనదారులకు ముప్పు





**షాద్‌నగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ కమ్మదనం రోడ్ పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గుంపులుగా తిరుగుతున్న కుక్కలు నాటు కోళ్లు, ఆవు దూడలు, బర్రె దూడలు, గొర్రె పిల్లలపై దాడులు చేసి చంపేస్తుండటంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.రహదారుల వెంట ప్రయాణించే వాహనదారులు, పాదచారులపై కూడా కుక్కలు దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.శుక్రవారం ఉదయం కమ్మదనం రోడ్డులోని శ్రీ లక్ష్మీ నరసింహ డైరీ సెంటర్ సమీపంలో కుక్కలు నాటు కోళ్లను చంపడంతో పాటు దూడలు, గొర్రె పిల్లలపై దాడులు చేశాయని డైరీ నిర్వాహకులు తెలిపారు.వీధి కుక్కల సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టి ప్రజలకు, పశువులకు, వాహనదారులకు నష్టం జరగకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వర్షాకాలానికి ముందస్తు చర్యలు

-నీరు నిల్వకుండా ప్రత్యేక ఏర్పాట్లు

- మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



**షాద్‌నగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని పలు వార్డుల్లో వర్షపు నీరు రోడ్లపై నిల్వకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు.శుక్రవారం ఆయన 18వ వార్డులోని భాగ్యనగర్ కాలనీ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో తక్షణ పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పెంటయ్య, కో-ఆప్షన్ సభ్యుడు సుజీవన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, చందు లాల్, కత్తి చంద్రశేఖరప్ప, తంగడపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని తపస్ డిమాండ్



**మెదక్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం, ప్రధాన కార్యదర్శి జాల సిద్దు డిమాండ్ చేశారు.సుప్రీం కోర్టు 2025 సెప్టెంబర్‌లో ఇచ్చిన తీర్పు ప్రకారం, ఇన్ సర్వీస్ టీచర్లు 2028 ఆగస్టు 31 లోపు టెట్ క్వాలిఫై కావాల్సి ఉందని, దీనితో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 30 వేల మంది టీచర్లు టెట్ పాస్ కావాల్సి ఉందని, ప్రభుత్వం రెండు సార్లు టెట్ నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నా అది తాత్కాలిక ఊరట మాత్రమేనని పేర్కొన్నారు.గత 30 ఏళ్లుగా ఉపాధ్యాయులు తమ ఎంపిక చేసిన సబ్జెక్టుల్లో బోధిస్తున్నప్పటికీ, టెట్‌లో అన్ని సబ్జెక్టులు కలిపి పరీక్షలు పెట్టడం అన్యాయమని, భాషా ఉపాధ్యాయులు ఇతర సబ్జెక్టులు చదివి పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఇప్పటికే దీక్ష, నిష్ఠ వంటి అనేక ఆన్‌లైన్ శిక్షణలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో టెట్ విధానం అసంబద్ధమని తపస్ పేర్కొంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి, ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని ఒప్పించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలకు అధిక నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్



**కరీంనగర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కరోజు శుభ్రత కార్యక్రమం నిర్వహించడం సరిపోదని, కేంద్రం నుంచి అధిక నిధులు ఇప్పించాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు.మోడీ పాలనలో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన విమర్శించారు. బండి సంజయ్ పార్లమెంట్‌లో ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం ఎప్పుడూ మాట్లాడలేదని ప్రశ్నించారు.9, 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి పూర్తి నిధులు, ప్రతి ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ నిధులు, సోలార్ సదుపాయాలు, కంప్యూటర్లు, లైబ్రరీలు, సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఐఐఐటి, సైన్స్ సెంటర్ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, నిరుద్యోగ యువత ఉపాధి కోసం పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం కేంద్రం నుంచి అధిక నిధులు తెప్పించాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**హుజురాబాద్ , జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఉప్పల్ బాయ్స్ హై స్కూల్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని పాఠశాల అధికారులు పిలుపునిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ విద్యా సదుపాయాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పిల్లలలో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి విలువలను పెంపొందించడంలో ప్రభుత్వ పాఠశాలలు ముందుంటాయని, ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో చదివిన అనేక మంది ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు.ప్రైవేటు స్కూలు వద్దు -- ప్రభుత్వ స్కూలు ముద్దు నినాదంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు.

# యదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేటీకరణపై మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆగ్రహం




**మిర్యాలగూడ, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

యదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ, ఈ ప్లాంట్ వేలాది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే మహత్తర ప్రాజెక్ట్ అని, భూసేకరణ సమయంలో ప్రజలు ఉద్యోగాల నమ్మకంతో సహకరించారని గుర్తు చేశారు. ఇంకా 700 మంది భూ నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రైవేటీకరణ పేరుతో వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని విమర్శించారు.ప్రైవేటీకరణ వల్ల స్థానిక యువత ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని, ప్రజా ఆస్తులను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రజావ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకొని, భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆర్యవైశ్య మహాసభలో పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హైదరాబాద్ చంపాపేటలోని సామ సరస్వతి గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణస్వీకారం మరియు ఇటీవల జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన ఆర్యవైశ్య ప్రజా ప్రతినిధులకు మాజీ మంత్రి టీజీ వెంకటేష్ సమక్షంలో అభినందన సత్కారం నిర్వహించారు. ఈ వేడుకలకు ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అధ్వర్యంలో పాపిశెట్టి రాము ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్యుల విద్య, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాల కోసం తమ వంతు కృషి చేయాలని, యువతకు మార్గదర్శకంగా ఉండాలని, సమాజంలో ఐక్యతను పెంపొందిస్తూ సేవా కార్యక్రమాలను విస్తరించాలని సూచించినట్లు రాము తెలిపారు.

# మూతపడిన పాఠశాల



**మర్రిగూడ, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని చర్లగూడెం గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ పాఠశాల మూతపడింది. శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముప్పు కారణంగా గ్రామంలోని భూ నిర్వాసితులు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పాఠశాల మూతపడటంతో మిగిలిన కొద్దిమంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల బాట పట్టారు. నివాస సౌకర్యం లేకపోవడంతో కొందరు భూ నిర్వాసితులు బడినే ఆశ్రయించగా, తరువాత మారిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

# రైతు వేదికల నిర్వహణ కష్టమేన

**-సొంత డబ్బులతోనే కొనసాగిస్తున్న ఏఈవోలు**




**మర్రిగూడ, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని గ్రామాలను ఐదు క్లస్టర్లుగా విభజించి వ్యవసాయ అధికారులు మొత్తం ఆరు రైతు వేదికలను నిర్మించారు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా ఈ వేదికల నిర్వహణ కష్టసాధ్యమవుతోందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేశారు.రైతు వేదికల నిర్వహణకు ప్రత్యేక నిధులు లేకపోవడంతో సొంత డబ్బులతోనే ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన వేదికలు సక్రమంగా పనిచేయాలంటే సంబంధిత వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# మంచినీటి సమస్యలు పరిష్కరించాలి

**-బోడుప్పల్ సర్కిల్‌లో పర్యటించిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్**



**బోడుప్పల్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్ సర్కిల్‌లోని అశోక్ నగర్ కాలనీలో మంచినీటి సమస్యలపై స్థానికుల విజ్ఞప్తి మేరకు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పర్యటించారు.లో ప్రెషర్ సమస్యపై ఆయన హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ చెంగిచర్ల మేనేజర్ యాదగిరితో చర్చించి, కాలనీవాసులకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.మేనేజర్ యాదగిరి సానుకూలంగా స్పందిస్తూ, సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్ర మంలో జలమండలి అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# 15న ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈ నెల 15న (సోమవారం) ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ ఎంఏ పాష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాషా కోరారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ తమ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

# అందరికీ విద్యా ప్రభుత్వమే అందించాలని పోరాడాలి

**- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి**

**- టిపిటిఎఫ్ జిల్లా స్థాయి అధ్యయన తరగతులు**




**హనుమకొండ, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బత్తిని శ్రీరామాంజనేయులు అధ్యక్షతన ఒకరోజు "జిల్లా స్థాయి అధ్యయన తరగతులు" స్థానిక మర్కజి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ తరగతులకు ముఖ్య వక్తగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం టిపిటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి బడిఈడు పిల్లలకు నాణ్యమైన, సమానమైన విద్యను ప్రభుత్వమే అందించాలని, దానికి కామన్ స్కూల్ విధానం అమలు చేయడం తప్ప వేరే మార్గం లేదని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, అరకొర నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించకపోవడం, రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టకపోవడం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిందని, ఆ కారణంగా బడులు మూసివేయడం హేయమైన చర్య అని విమర్శించారు. పూర్వ రాష్ట్ర అధ్యక్షులు సూద రాజేందర్ మాట్లాడుతూ, విద్య ప్రైవేటీకరణ ప్రజాస్వామ్య వ్యవస్థ మౌలిక ఆశయానికి భంగం కలిగిస్తోందని, సమసమాజ నిర్మాణమే టిపిటిఎఫ్ ధ్యేయమని పేర్కొన్నారు. కాంట్రాక్టు, గెస్ట్ పార్ట్ టైం నియామక విధానాలను వ్యతిరేకించి, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్యపరచే బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు పి. నాగిరెడ్డి మాట్లాడుతూ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనరీ ప్రయోజనాలను ఏకమొత్తంలో విడుదల చేయాలని, కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. చివరి సెషన్‌లో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఆయన విద్యారంగ ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారని, రాష్ట్ర, జిల్లా శాఖల తరపున మెమెంటో అందజేశారు. ఈ అధ్యయన తరగతుల్లో రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, సీనియర్ నాయకులు జి. నటరాజ్, బిల్ల సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రంలో స్టడీ మెటీరియల్ పంపిణీ

**ఆమనగల్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ పట్టణ కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రంలో పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొని అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రతిభ పట్టణాలకే పరిమితం కాదని, గ్రామీణ యువతలోనూ అపారమైన సామర్థ్యం ఉందని, సరైన మార్గదర్శకత్వం, అవకాశాలు లభిస్తే వారు కూడా ఉన్నత స్థానాలను అధిరోహించగలరని అన్నారు. ఆ అవకాశాలను కల్పించాలనే సంకల్పంతోనే సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఉద్యోగం సాధించడం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా కుటుంబ భవిష్యత్తును మార్చే బాధ్యత కూడా అని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు పెట్టుకుని ప్రతి రోజు లక్ష్యంపై దృష్టి పెట్టాలని



సూచించారు. మొబైల్ ఫోన్లు, కాలయాపనకు దూరంగా ఉండి క్రమశిక్షణతో సిద్ధమైతే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అభ్యర్థులకు సూచించారు. ఆరు మండలాల్లో కొనసాగుతున్న ఈ ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రాలు నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా మారాయని, ఆర్థిక ఇబ్బందులు ఎవరి కలలకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉచితంగా పోలీస్ శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించడం ఎంతో అభినందనీయమని, ఆర్థిక పరిస్థితుల కారణంగా కోచింగ్ తీసుకోలేని వారికి ఈ శిక్షణ కేంద్రాలు గొప్ప అవకాశంగా మారాయని తెలిపారు. తమ భవిష్యత్తు కోసం ఆలోచించి, ఉద్యోగ సాధన దిశగా అండగా నిలుస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్ రెడ్డి, రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్, భాస్కర్, కృష్ణ, అధ్యాపకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# సిఎస్ఐ స్కూల్లో అలింకో క్యాంప్

**అర్హులైన పిల్లలకు టీఎల్ఎం కిట్లు, హియరింగ్ ఎయిడ్, వీల్‌చైర్లు పంపిణీ**



**నందికొట్కూరు, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండలంలోని సిఎస్ఐ స్కూల్లో డివిజన్ వ్యాప్తంగా అలింకో క్యాంప్ నిర్వహించారు. అర్హులైన వారికి ముందుగానే మెటీరియల్, లిస్టులు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామిరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీపీ ఎస్‌పేట స్కూల్ హెచ్‌ఎం భాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు పిల్లలకు టీఎల్‌ఎం కిట్లు, హియరింగ్ ఎయిడ్‌లు, వీల్‌చైర్లు పంపిణీ చేశారు. అర్హులైన పిల్లలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమం సానుకూల వాతావరణంలో జరిగింది.

# గంజాయి మత్తుపై అవగాహన సదస్సు




**ఖానాపూర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యువత గంజాయి, కుక్కైన్ వంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని నిర్మల్ జిల్లా ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గంగారెడ్డి సూచించారు. సత్తెనపల్లి గ్రామ రైతు వేదికలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల యువత చదువు, ఉద్యోగాలు కోల్పోయి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని హెచ్చరించారు. అందరూ కంకణం కట్టి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక బృందం ఎల్‌ఈడి ప్రొజెక్టర్ ద్వారా గంజాయి స్మగ్లింగ్‌పై అవగాహన కల్పించింది. ఎంపీడీవో రాధా రాథోడ్, పోలీస్ ఎస్ఐ కూడా గంజాయి మత్తు ప్రమాదాలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నాకర్ రావు, గౌరవ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. యువత భవిష్యత్తు కోసం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఉప్పల్ స్కైవాక్ లిఫ్ట్‌లో చిక్కుకున్న వ్యక్తి

**-సకాలంలో స్పందించిన డి.ఏల్.ఎఫ్ సిబ్బంది**



**ఉప్పల్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ స్కైవాక్ లిఫ్ట్‌లో ఓ వ్యక్తి చిక్కుకున్న ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న డి.ఏల్.ఎఫ్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని సురక్షితంగా బయటకు తీశారు. లిఫ్ట్ సాంకేతిక లోపం కారణంగా ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. బాధితుడు మాట్లాడుతూ, "చాలా భయభ్రాంతులకు గురయ్యాను, సకాలంలో డి.ఏల్.ఎఫ్ సిబ్బంది వచ్చి నన్ను కాపాడారు" అని తెలిపాడు. ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రజలు స్కైవాక్‌ను ఉపయోగిస్తున్నందున, ఇలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా లిఫ్ట్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రెండు బైకులు ఢీ - ఇద్దరు మృతి

**-ఒకరికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు**

**అడవిదేవులపల్లి, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అడవిదేవులపల్లి మండల పరిధిలోని ముది మాణిక్యం గ్రామానికి వెళ్లే రహదారిలో అతివేగంతో ఎదురెదురుగా వెళ్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే పగిళ్ల అక్కులు, అడవిదేవులపల్లి గ్రామానికి చెందిన బొమ్మకంటి నరసయ్య మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, వెంటనే మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# రైతుల కేది భరోసా..?

**- సాగు పెట్టుబడుల కోసం రైతుల తండ్లాట**



**ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఖరీఫ్ లో రైతులు దుక్కులు దున్ని పంటలు వేస్తున్న సమయం ఆసన్నమైన వేల, పంట పెట్టుబడికి డబ్బులు లేక విలవిల పోతున్న రైతన్నలు. ప్రభుత్వ అందించే రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు. కల్వకుర్తి నియోజకవర్గంలో వ్యవసాయమే జీవనాధారంగా బతుకు సాగిస్తున్న రైతన్నలకు ప్రభుత్వం అందించే రైతు భరోసా డబ్బులు అందించకపోవడం పట్ల నిరాశే మిగిలిందని చెప్పాలి. మృగశిర కార్తి ప్రవేశించడంతో రైతన్నలు దుక్కి దున్ని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతు భరోసా డబ్బులు విడుదల కాకపోవడం పట్ల రైతులకు నిరాశ మిగిలిందని చెప్పాలి.

**పంటల సాగుకు పెరిగిన ఖర్చులు..**

విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్ల, కూలీల ఖర్చులు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం పత్తి మొక్కజొన్న వరి పంటల సాగు చేసేందుకు సిద్ధమవుతుండగా, ఒక్కో రైతుకు గత సంవత్సరం కంటే వేలాది రూపాయలు అధిక భారం పడుతుండటంతో రైతన్నలు ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికీ రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో రైతన్నలు బ్యాంకుల చుట్టూ ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధిక వడ్డీలతో అప్పులు తీసుకొని పంటలు సాగు చేస్తున్న రైతన్నలు. ఈ సమయంలో కూడా రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడం పట్ల రైతుల్లో ఆందోళన మొదలైంది. సమయానికి డబ్బు లేక ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలు ఎరువులు ఉద్దెరా తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

# రైతు అభివృద్ధికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్**



**ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్);**
రైతు అభివృద్ధికి రైతు రిజిస్ట్రేషన్ చాలా అవసరమని ఆమనగల్లు మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. రైతు రిజిస్ట్రేషన్ చేస్తే రైతుల పూర్తి వివరాలు ప్రభుత్వానికి అందుబాటులో ఉంటాయని, దీంతో రైతులకు రావాల్సిన పథకాలు సకాలంలో అందుతాయన్నారు. రైతు రిజిస్ట్రేషన్ ఉంటే పీఎం--కిసాన్, రైతు బీమా, పంటల బీమా, ఎరువులు, విత్తనాలు, సబ్సిడీలు, రాయితీలు వంటి ప్రభుత్వ పథకాలు నేరుగా రైతులకు అందుతాయని తెలిపారు. భూమి వివరాలు, పంట వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు అన్నీ ఒకేచోట నమోదు కావడం వల్ల జాప్యం లేకుండా రైతులకు సేవలు అందుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం ద్వారా ప్రతి రైతు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలతో సమీపంలోని రైతు సేవా కేంద్రం లేదా వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఇందుకు ఎలాంటి ఫీజు ఉండదని తెలిపారు. ఆమనగల్లు మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని వెంటనే తమ రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ

**వెల్దండ, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎమ్మార్వో కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ పనుల పురోగతిపై సమీక్ష జరిగింది. సర్పంచులు తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అసిఫ్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎల్ఎన్ రెడ్డి

**- గ్రామ పంచాయతీల ఆర్థిక పురోగతితోనే బంగారు తెలంగాణ సాధ్యం**

**- స్థానిక సంస్థల బలోపేతానికి ద్వితీయ ఫైనాన్స్ కమిషన్ సరైన సూచనలు చేయాలి**

**- సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
తెలంగాణ రాష్ట్ర ద్వితీయ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) సభ్యులు మహ్మద్ ఆసిఫ్ అలీ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆసిఫ్ అలీ భవిష్యత్తులో ప్రజాసేవలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన రెండవ ఆర్థిక సంఘంపై క్షేత్రస్థాయిలో ఉన్న స్థానిక సంస్థలకు, ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు ఎన్నో ఆశలు మరియు అంచనాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించాలన్నా, స్థానిక సంస్థలు బలోపేతం కావాలన్నా ఆర్థిక వనరులు అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ద్వితీయ ఫైనాన్స్ కమిషన్.. స్థానిక సంస్థల ఆర్థిక స్వయం సమృద్ధికి, నిధుల సరైన కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వానికి అత్యంత పటిష్టమైన, సరైన సూచనలు చేయాలని ఆసీఫ్ అలీని, లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి కోరారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు సకాలంలో నేరుగా పంచాయతీల ఖాతాల్లోకి చేరేలా చూడాలని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్యాకేజీలు అందించేలా సిఫార్సు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు పిప్పళ్ళ వెంకటేష్, గురిగల్ల రామచంద్రయ్య, కందికంటి సుధాకర్ గౌడ్, మూడ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆసిఫ్ అలీ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీ జన్మదిన వేడుకలను శుక్రవారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో రేవంత్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పూలమాల శాలువాతో సత్కరించి ఆసిఫ్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక నాయకులతో కలిసి కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఈమేరకు అసిఫ్ అలీ మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు భవిష్యత్తు ఉంటుందని, యువజన కాంగ్రెస్ లో మంచి వక్త అయితే కాంగ్రెస్ పార్టీలో నాయకునిగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో నాయకునిగా ఎదిగేందుకు యువజన కాంగ్రెస్ పునాది లాంటిదని పేర్కొన్నారు. ఇప్పుడున్న మంత్రులు, ఎంపీలు, రాష్ట్ర, జాతీయ కాంగ్రెస్ నాయకులు చాలామంది మొదట యువజన కాంగ్రెస్ పనిచేసిన వారేనని ఆయన తెలిపారు. తనకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు రాయికంటి బిక్షపతి, అద్దాల మహేందర్ గౌడ్, కరుణాకర్ గౌడ్, గుజ్జుల లక్ష్మమ్మ, బాలరాజు, మహేందర్, ఉపసర్పంచులు యాదగిరి రెడ్డి, దళపతి గౌడ్, వార్డు సభ్యులు ఎర్రోళ్ల రాఘవేందర్, ముత్తి కృష్ణ, భాను కిరణ్, విజయ్ కుమార్, రవి నాయక్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామా రాజేష్, నియోజవర్గ ఉపాధ్యక్షులు ఇమ్రాన్ బాబా, మండల అధ్యక్షులు బోస్ రవి, నాయకులు గురగల్లా లక్ష్మయ్య, కేశవులు, లకుపత్తి నాయక్, జహంగీర్ అలీ, అజ్గర్ అలీ, ఆనంద్, యాదయ్య, సత్యం, మహేందర్, చంద్రశేఖర్, శ్రీకాంత్, మహేష్, రాజు, నరేష్, శేఖర్, మల్లేష్, మూడ రవి, రాములు, భాస్కర్, వినోద్, రమేష్, బాలకృష్ణ, లక్ష్మణ్, శ్రీను, హరి, పవన్, లింగం, శివ, కుమార్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**పోలీస్ వెల్ఫేర్ డేలో ఎస్పీ సునీల్ షోరాణ్ భరోసా**

**నంద్యాల, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




పోలీసు సిబ్బంది సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ తెలిపారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో "పోలీస్ సంక్షేమ దివస్" కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, హోంగార్డులు పాల్గొని తమ వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను ఎస్పీకి విన్నవించారు. సిబ్బంది వినతులను స్వయంగా స్వీకరించిన ఎస్పీ, సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకొని, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీస్ సిబ్బంది మానసిక ప్రశాంతత, సంక్షేమం మాకు ముఖ్యం. వెల్ఫేర్ డే ద్వారా సమస్యలను తొలగించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చేస్తున్నాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య కమిషన్ సభ్యుడు వెంకటేష్ ను కలిసిన నాయకులు



**ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ ను కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవస్థానం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావాలి శ్రీశైలం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నుండి వంగూరు కు పలు కార్యక్రమాలకు వెళ్తున్న తరుణంలో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రవేట్ పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్య కమిషన్ సభ్యుడు వెంకటేష్ ను కోరినట్లు శ్రీశైలం తెలిపారు. ఆయన వెంట రేవంత్ రెడ్డి మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు జింకల భాస్కర్, నాయకులు గోసుల వెంకటేష్ యాదవ్, దినేష్ సాగర్, విజయ్, మంద రాకేష్, రాములు, శేఖర్, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు అసిఫ్ అలీ**



**ఆమనగల్లు, జూన్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు అసిఫ్ అలీ సూచించారు. శుక్రవారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో ఆయన జన్మదిన వేడుకలను రేవంత్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసిఫ్ అలీ తో మొక్కలను నాటి పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు రాయికంటి బిక్షపతి, అద్దాల మహేందర్ గౌడ్, కరుణాకర్ గౌడ్, గుజ్జుల లక్ష్మమ్మ, బాలరాజు, మహేందర్, ఉపసర్పంచులు యాదగిరి రెడ్డి, దళపతి గౌడ్, వార్డు సభ్యులు ఎర్రోళ్ల రాఘవేందర్, ముత్తి కృష్ణ, భాను కిరణ్, విజయ్ కుమార్, రవి నాయక్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామా రాజేష్, నియోజవర్గ ఉపాధ్యక్షులు ఇమ్రాన్ బాబా, మండల అధ్యక్షులు బోస్ రవి, నాయకులు గురగల్లా లక్ష్మయ్య, కేశవులు, లకుపత్తి నాయక్, జహంగీర్ అలీ, అజ్గర్ అలీ, ఆనంద్, యాదయ్య, సత్యం, మహేందర్, చంద్రశేఖర్, శ్రీకాంత్, మహేష్, రాజు, నరేష్, శేఖర్, మల్లేష్, మూడ రవి, రాములు, భాస్కర్, వినోద్, రమేష్, బాలకృష్ణ, లక్ష్మణ్, శ్రీను, హరి, పవన్, లింగం, శివ, కుమార్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటుతో గద్దెనెక్కిన చంద్రబాబు






**-రానున్న ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరవేయాలని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆశయం**

**-- వైసీపీ ఇన్‌చార్జి డా. దారా సుధీర్**



**నందికొట్కూరు, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరులో శుక్రవారం వైఎస్సార్సీపీ శ్రేణులు "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బుడ్డా శేషి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో వైసీపీ ఇన్‌చార్జి డా. దారా సుధీర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని పక్కనబెట్టి రాజకీయ కక్షసాధింపుకే పరిమితమైందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన "సూపర్ సిక్స్" హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిందని ఆరోపించారు. నందికొట్కూరు చుట్టూ నీరు ఉన్నప్పటికీ నియోజకవర్గానికి నీటిని తీసుకురావడంలో గత, ప్రస్తుత పాలకులు ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. ముచ్చుమర్రి బాలిక వాసంతి ఆచూకీ లభ్యం కాలేదని, ఇది హోంమంత్రి, పవన్, లోకేష్, పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలంటే రానున్న ఎన్నికల్లో వాడవాడన వైసీపీ జెండా ఎగరవేయాలని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆశయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు, కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలాలు





**మేషరాశి**
దూర ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. ఉద్యోగాలలో ప్రతికూల వాతావరణం ఉంటుంది. బంధు మిత్రులతో ఆలోచించి మాట్లాడటం మంచిది. ఆదాయ మార్గాలు తగ్గుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. అదృష్ట రంగు: ఎరుపు
సంఖ్య :5

**వృషభరాశి**
చిన్ననాటి మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడి పాత ఋణాలు తీర్చగలుగుతారు. ఉద్యోగాలలో నూతన అవకాశములు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు అప్రయత్నంగా పూర్తవుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. అదృష్ట రంగు: తెలుపు
సంఖ్య: 6

**మిధునరాశి**
చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు. నిరుద్యోగులకు లభించిన అవకాశములు సద్వినియోగం చేసుకోవాలి. దూరపు బంధువులు నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. అదృష్ట రంగు : ఆకుపచ్చ సంఖ్య :6

**కర్కాటకరాశి**
ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించలేరు. బంధు మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు నష్టం కలిగిస్తాయి. అదృష్ట రంగు: వెండి రంగు
సంఖ్య :8

సింహరాశి
దూర ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. సంతాన ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరమౌతాయి. దీర్ఘకాలిక ఋణ భాధలు పెరుగుతాయి. వ్యాపార లావాదేవీలు మందగిస్తాయి. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమౌతుంది.

**కన్యరాశి**
అప్తులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. సంఘంలో ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. అదృష్ట రంగు: ఆకుపచ్చ
సంఖ్య: 1

తులరాశి
నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాల వలన ఆర్థిక పురోగతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో సోదరుల నుండి విలువైన సమాచారం అందుతుంది. ఉద్యోగస్థుల శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. అదృష్ట రంగు: తెలుపు
సంఖ్య :2

వృశ్చికరాశి
కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా చికాకు కలిగిస్తుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నూతన ఋణాలు చేస్తారు. బంధు మిత్రులు మీ మాటతో విబేదిస్తారు. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. అదృష్ట రంగు: మెరూన్
సంఖ్య :3

ధనస్సురాశి
ముఖ్యమైన పనులలో కీలక నిర్ణయాలు చెయ్యలేరు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో వివాదాలు తప్పవు. ఆర్థిక వ్యవహారాలలో ఆశించిన పురోగతి ఉండదు. నిరుద్యోగుల కష్టం ఫలించదు. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది. అదృష్ట రంగు: పసుపు
సంఖ్య:5

మకరరాశి
బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అధికారుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. మంచి మాట తీరుతో అందరిని ఆకట్టుకుంటారు. సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. అదృష్ట రంగు :నీలం
సంఖ్య :5

కుంభరాశి
స్థిరాస్తి విషయమై సోదరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆర్థిక వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. జీవిత భాగస్వామితో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. అదృష్ట రంగు:నీలం
సంఖ్య :6

మీనరాశి
దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. విలువైన వస్త్ర, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి సంభందిత వివాదాలు నుండి బయటపడతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన స్థానచలనాలుంటాయి. నిరుద్యోగులకు ఉన్నతావకాశములు లభిస్తాయి. వ్యాపార లావాదేవీలు అనుకూలిస్తాయి. అదృష్ట రంగు: పసుపు
సంఖ్య :7

**(రాశి ఫలాలు నిపుణుల సలహాలతో అనుసరించండి)**

**శ్రీ కాలభైరవ ఉపవాసకులు**

**డక్క జంబులయ్య (స్వామి)**

**9491163914**



# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఎలిగేడు మండలంలో స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమం**



పారిశుద్ధ పనులు పర్యవేక్షిస్తున్న రాకల్ దేవ్ పల్లి సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్



స్వచ్ఛ శుక్రవారం లో పాల్గొన్న రాములపల్లె సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్.

**ఎలిగేడు, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు ప్రబలకుండా నివారించడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సర్పంచులు మద్దెల రమాదేవి-సంపత్, సిద్ధి తిరుపతి యాదవ్ అన్నారు. ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లి, రాములపల్లి గ్రామాల్లో సానిటేషన్‌లో భాగంగా స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి మహిళలు నాలుగు రకాల చెత్తను వేరు చేసి చెత్త వాహనానికి అందించాలని, అలాగే ఇంటి ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు బొడిగె శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు అశోక్, హరిబాబు, ఫీల్డ్ ఆఫీసర్ సాగర్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ పొలంలో అగ్ని ప్రమాదం

**-అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం**





**వెల్దండ, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం పరిసర ప్రాంతంలో జి. రమేష్‌కు చెందిన వ్యవసాయ పొలంలో మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, కల్వకుర్తి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మొక్కజొన్న పంట పొలంలో మంటలు వ్యాపించినప్పటికీ, సకాలంలో చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని యజమాని జి. రమేష్ తెలిపారు. అయితే పొలంలో ఉన్న వాటర్ పైప్‌లైన్ కాలిపోవడంతో కొంతమేర నష్టం వాటిల్లిందని కల్వకుర్తి ఎస్ఎఫ్ఓ చంద్రశేఖర్ వివరించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి



**ఖానాపూర్, జూన్ 12 (నీలిమల ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తన తండ్రి మృతి చెందారని సుర్జాపూర్ గ్రామానికి చెందిన షేక్ షారుఖ్ ఆరోపించారు. తన తండ్రి షేక్ హుస్సేన్‌కు అర్ధరాత్రి తీవ్ర నొప్పులు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లినా, అక్కడ కేవలం ఒక ఇంజెక్షన్, మూడు మాత్రలు మాత్రమే ఇచ్చారని, బీపీ, షుగర్ పరీక్షలు చేయలేదని ఆయన తెలిపారు. వైద్యుడు కూడా పరిశీలించలేదని ఆరోపించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఆసుపత్రిలో ఉన్నప్పటికీ స్పందన లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లగా, మరుసటి రోజు ఉదయం మళ్లీ ఆసుపత్రికి తీసుకురాగానే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. విధుల్లో ఉన్న నర్సు, డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాత్రి వేళల్లో వైద్య సేవలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని షారుఖ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# బిజినెస్

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**-- సెన్సెక్స్ 1,695 పాయింట్లు పైకి..**

**--- ఒక్కరోజే 9.7 లక్షల కోట్ల సంపద పెంపు**



భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలు చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఏకంగా 1695 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ కూడా అత్యధికంగా 461.30 పాయింట్లు పైకి ఎగసింది. ట్రేడింగ్ ఉదయం భారీ లాభాల్లో 74,709.27 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది.ఒక దశలో సెన్సెక్స్ 75,608.02 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు 1695.40 పాయింట్ల లాభంతో 75,527.95 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా రోజంతా లాభాల్లోనే కొనసాగింది. చివరకు 461.30 పాయింట్ల లాభంతో 23,622.90 పాయింట్ల వద్ద ముగిసింది. భారీ లాభాల కారణంగా స్టాక్ మార్కెట్ ఈ ఒక్కరోజే ఏకంగా రూ.9.7 లక్షల కోట్లు అర్జించింది. దీంతో భారత స్టాక్ మార్కెట్ విలువ రూ.452.33 లక్షల కోట్ల నుంచి రూ.462.05 లక్షల కోట్లకు పెరిగింది. సెన్సెక్స్ 20 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, ఇండిగో, ఎల్అండ్‌టీ, టైటాన్ షేర్లు లాభపడగా, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గాయి. శుక్రవారం బ్రెంట్ బ్యారెల్ క్రూడాయిల్ ధర 86 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర కూడా తగ్గి, 4224 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉండటం, అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు కలిసొచ్చింది.

## బంగారం, వెండి ధరలు. ఎలా ఉన్నాయంటే.

**ఇంటర్నెట్ డెస్క్:**
యూఎస్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పతాకస్థాయికి చేరిన నేపథ్యంలో పసిడి ధరలు తగ్గుతున్నాయి. గత రెండు రోజులుగా ధరలు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. వెండి ధర కూడా ఓ మోస్తరు స్థాయిలో తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, (జూన్ 12) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,45,630 వద్ద కొనసాగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,33,490గా ఉంది. కిలో వెండి రూ.2,59,900గా ఉంది. విజయవాడలో కూడా ధరలు దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,47,270గా ఉంది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,34,990గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,45,630గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,33,490గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో



24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,780 వద్ద కొనసాగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,33,640గా ఉంది. ఇక వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.5 లక్షల నుంచి రూ.2.6 లక్షల మధ్య ఉంది. ఇరాన్‌తో డీల్ కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించడంతో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**గమనిక:** బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

## ఒక్కసారి ఫుల్ చార్జి చేస్తే 39గంటలు నాన్‌స్టాప్ కాల్స్ మాట్లాడొచ్చు..

**- భారీ బ్యాటరీతో టెక్నో పోవా 8 లాంచ్!**

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ టెక్నో తన కొత్త పోవా 8 స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. గత ఏడాది వచ్చిన పోవా 7కు అప్‌గ్రేడెడ్ వెర్షన్‌గా తీసుకొచ్చిన ఈ మొబైల్ భారీ బ్యాటరీ, హై రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లే, శక్తివంతమైన ప్రాసెసర్ వంటి ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను ఆకట్టుకుంటుంది. భారత్‌లో పోవా 8 రెండు వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. 6జీబీ ర్యామ్+128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.29,999గా నిర్ణయించారు. 8జీబీ ర్యామ్+128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.31,999గా ఖరారు చేశారు. ఈ మొబైల్ 16 బిట్ వైట్, ప్లాస్మా ఆరెంజ్, టెర్మినల్ గ్రీన్ రంగుల్లో అందుబాటులో ఉంది.



---

# స్పోర్ట్స్

## అంతర్జాతీయ క్రికెట్‌కు విలియమ్సన్ వీడ్కోలు..

**-ఎందుకీ షాకింగ్ నిర్ణయం..!**

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. క్లాస్ ఆటతో ఫ్యాబ్-4లో ఒకడిగా పేరొందిన విలియమ్సన్ ఉన్నట్టుండి తన సుదీర్ఘ కెరీర్‌ను ముగిస్తున్నానని ప్రకటించాడు. తన సొగసైన ఆటతో, సమర్థ నాయకత్వంతో కివీస్ క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన ఈ లెజెండరీ ఆటగాడు ఇంగ్లండ్ సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ ప్రకటించడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.పదహారేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన కేన్ విలియమ్సన్ హఠాత్తుగా వీడ్కోలు చెప్పేశాడు. ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్ మధ్యలోనే ఈ దిగ్గజం నేను ఇక ఆడలేను అంటూ ఆటకు అల్విదా పలికాడు. లార్డ్స్ టెస్టులో ఆతిథ్య జట్టు చేతిలో ఘోర పరాభవంతో బాధ పడిన విలియమ్సన్ ఈ కఠిన నిర్ణయానికి వచ్చాడు.వీడ్కోలుపై నేను కొన్నిసార్లు ఆలోచించాను. అయితే.. గత కొన్ని రోజులుగా రిటైర్మెంట్ ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. ఆటను వదిలేసేందుకు ఇదే సరైన సమయం అనిపించింది.




అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు నేను ఎంతో ఆకలితో ఉండేవాడిని. న్యూజిలాండ్‌కు ఆడిన ప్రతి మ్యాచ్‌లో నా శక్తినంతా ధారపోసినందుకు చాలా గర్వంగా ఉంది. మునపటిలా ఆడలేనప్పుడు ఆటలో కొనసాగడం సరిగా అనిపించలేదు. స్వచ్ఛందంగా క్రికెట్‌కు వీడ్కోలు పలకడాన్ని అదృష్టంగా భావిస్తున్నా' అని విలియమ్సన్ వెల్లడించాడు.

**ప్రపంచ టెస్టు ఛాంపియన్**

ఫ్యాబ్ 4లో తన జోరు చూపించిన విలియమ్సన్.. విరాట్ కోహ్లీ, జో రూట్, స్టీవ్ స్మిత్‌లతో పోటీగా క్రేజ్ సంపాదించుకున్నాడు. 2021లో న్యూజిలాండ్‌ను ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా నిలిపాడు. అంతేనా.. 2019లో బ్లాక్ క్యాప్స్‌ను వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ చేర్చిన విలియమ్సన్.. అంపైర్ నిర్ణయంతో కప్ చేజారినా కోట్లాది మంది మనసులు గెలుచుకున్నాడు.నిరుడు నవంబర్‌లో అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పిన కేన్ మామ.. ఇప్పుడు తనకెంతో ఇష్టమైన టెస్టు, వన్డే ఫార్మాట్ల నుంచి కూడా వైదొలిగాడు. ఐపీఎల్‌లోనూ తనదైన శైలిలో మెరుపులు మెరిపించిన కేన్ మామ.. సన్ రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిథ్యాన్ని వహించాడు.


## దోహా డైమండ్ లీగ్‌కు నీరజ్ చోప్రా దూరం..!




పారిస్ ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా మరో మెగా ఈవెంట్‌కు దూరమయ్యాడు. గాయంతో బాధ పడుతున్న చోప్రా ప్రతిష్ఠాత్మక దోహా డైమండ్ లీగ్ నుంచి వైదొలిగాడు. వెన్ను గాయం నుంచి కోలుకుంటున్న అతడు జూన్ 19 నుంచి మొదలయ్యే మెగా ఈవెంట్‌లో పాల్గొనడం లేదు. దాంతో, నిరుడు ఇదే లీగ్‌లో 90 మీటర్ల దూరం ఈటెను విసిరిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ ఆటను అభిమానులు మిస్ కానున్నారు.ఈ మధ్య కాలంలో గాయాల కారణంగా పలు టోర్నీలకు డుమ్మా కొడుతున్న నీరజ్ చోప్రా ఈటెను పట్టేందుకు మరింత సమయం పట్టనుంది. ప్రస్తుతం నీరజ్ వెన్నెముక గాయం నుంచి కోలుకుంటుండడమే అందుకు కారణం. ఫలితంగా జూన్ 19 నుంచి జరిగే దోహా డైమండ్ లీగ్‌కు చోప్రా దూరమయ్యాడు.త్వరలో జరుగబోయే కామన్‌వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడలే లక్ష్యంగా పెట్టుకున్న నీరజ్.. సైకోథెరపిస్ట్ ఇషాన్ మర్వాహ, కోచ్ జై చౌదరీ సాయంతో స్విట్జర్లాండ్‌లోని బీయెన్నేలో 47 రోజుల శిక్షణ తీసుకుంటున్నాడు.

## విమానంలో క్రికెట్.. కూతురికి సవాల్ విసిరిన సచిన్..!

క్రికెట్ గాడ్‌గా కోట్లాది మంది గుండెల్లో కొలువైన సచిన్ టెండూల్కర్ మరోసారి తన ఆటతో వైరలవుతున్నాడు. వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా పదమూడేళ్ల క్రితమే వీడ్కోలు పలికిన సచిన్ తాజాగా విమానంలో క్రికెట్ ఆడుతున్న వీడియో నెట్టింటిని షేక్ చేస్తోంది. కుటుంబంతో కలిసి ప్రైవేట్ జెట్‌లో వెళ్తూనే.. తనకెంతో ఇష్టమైన, తన జీవితంలో భాగమైన క్రికెట్ ఆడుతూ మాస్టర్ బ్లాస్టర్ తెగ సంబురపడిపోయాడు.మైదానంలో రికార్డుల రారాజుగా కెరీర్ ముగించిన సచిన్ ఆటకు మాత్రం దూరమవ్వడం లేదు. వీలు చిక్కినప్పుడల్లా బ్యాట్ అందుకొని క్రికెట్ ఆడుతూ మురిసిపోయే టెండూల్కర్.. ఈసారి విమానాన్నే ఆట స్థలంగా మార్చేశాడు. కుటుంబంతో కలిసి వెయ్యి అడుగుల ఎత్తులో ప్రైవేట్ జెట్‌లో వెళ్తూనే.. తన మనసుకు నచ్చిన క్రికెట్ ఆడాడు. అంతేనా.. నువ్వు నన్ను ఔట్ చేయలేవు అంటూ కూతురు సారా టెండూల్కర్‌ను ఆట పట్టడించాడీ దిగ్గజం. "ఎంత ఎత్తైనా సరే..



ఆటిట్యూడ్ మాత్రం మారదు" అనే క్యాప్షన్‌తో వీడియో పంచుకున్నాడు సచిన్.ప్రైవేట్ విమానం క్యాబిన్‌లో సచిన్ క్రికెట్ ఆడుతున్న వీడియోలో కోడలు సానియా చందోక్, కూతురు సారా ఉన్నారు. ఎరుపు బంతిని సానియా విసరగా.. సారా ఫీల్డింగ్ చేసింది. అయితే.. కూతురు క్యాచ్ అందుకునేందుకు ప్రయత్నించి విఫలమవ్వగా.. 'నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని సచిన్ సరదాగా అన్నాడు. ఒకప్పుడు మైదానంలో టన్నుల కొద్దీ పరుగులతో అభిమానులను అలరించిన సచిన్ ఆకాశవీధిలో.. బ్యాట్ పట్టుకొని కనిపించడంతో క్రికెట్ ఫ్యాన్స్ ఖుషీకి హద్దే లేదనుకో.